## మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలి



మరుగుదొడ్లు శుభ్రం చేసే వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి.

మర్పల్లి, అగస్టు 20: పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాలలో మరు గుదొడ్లు శుభ్రం చేసే వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ కొండామాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని 300 పాఠ శాలలో మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్య క్షుడు మాధవరెడ్డి, మండలాధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మర్పల్లి కో ఆర్డినేటర్ శేఖర్, గరుడ టీం సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు

### హామీలు ఎక్కువ.. అమలు తక్కువ



మాకు మూడు ఎకరాల భూమి ఉంది. వికారాబాద్ కెనరా బ్యాంక్‌లో మూడు సంవత్సరాల క్రితం రూ. 65వేలు రుణం తీసుకున్నాను. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేశాను. మిత్తి 25వేలు పడింది. మొదటి విడతలో రుణ మాఫీ లిస్టులో పేరు రాలేదు. బ్యాంక్ అధికారులను అడగగా మూడో విడతలో వస్తాయని చెప్పాడు. మూడవ విడతలో కూడా పేరు రాలే దు. మళ్లీ అధికారుల వద్దకు వెళ్లి అడగగా ప్రాసెస్‌లో ఉంది. 15రోజుల తరువాత వస్తాయని చెబు తున్నారు. ఎన్నిసార్లు తిరిగినా రుణ మాఫీ కాకపోవడం ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మా ఊరి వాళ్ల కు చాలా మందికి రాలేదు. కెనరా బ్యాంకులో అధికారుల తప్పిదం వల్లో, ప్రభుత్వం నిధులు మంజూరు ఇవ్వక పోవడం వల్లనో రుణ మాఫీ కాలేదు.

చిట్టంపల్లి సాయిలు, మదన్‌పల్లి, వికారాబాద్.

# రుణ మాఫీపై కాంగ్రెస్ మోసం



మదన్‌పల్లి గ్రామంలో రుణ మాఫీ కాని రైతులు

వికారాబాద్, ఆగస్టు 20 : బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా రుణ మాఫీ విషయంలో రైతులకు స్పష్టత రాలేదు. మొదటి విడతలో లక్షలోపు ఉన్న రైతులకు రుణ మాఫీ చేస్తామని చెప్పి చాలా మందికి చేయలేదు. రెండో విడతలో రూ. 1.50 లక్ష లోపు ఉన్న వారికి మాఫీ చేస్తామని చెప్పినా..అందులో కూడా చాలా మంది రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం మూడవ విడత రూ. రెండులక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులకు గ్రామాల్లో 80 శాతం మంది రైతులకు మాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. హామీలు ఇచ్చే టప్పుడు ఇలాంటి కొర్రీలు ఉంటాయని ఎందుకు చెప్పలేదని రైతులు ప్రభుత్వాన్ని నిల

### కొర్రీలతో గందరగోళం.. పక్కాగా చేయాలని డిమాండ్

దీస్తున్నారు. రుణాలు తీసుకొచ్చి పంటలు సాగు చేస్తున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని మండిపడుతున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామంలో ఇరవైఐదు శాతం మాత్రమే రుణ మాఫీ చేశారు. ఇంకా ముప్పావు వంతు చేయకుండా వదిలేశారని రైతులు కోపగించుకుంటున్నారు. గ్రామంలో దాదాపుగా నాలుగు వందల మంది వరకు రైతులు ఉన్నారు. వీరు వికారాబాద్ పట్టణంలోని కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ తదితర బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. కెనరా బ్యాంకులో తీసుకున్న రైతులకు ఎక్కువ శాతం మాఫీ కాలేదని వాపోతున్నారు. ఎలాంటి కొర్రీలు లేకుండా పారదర్శకంగా రుణ మాఫీ చేయాలని రైతులు తెలియజేస్తున్నారు. ముందస్తుగా అవగాహన కల్పించి రుణ మాఫీ చేస్తే బాగుండేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### మమ్మల్ని పట్టించుకోవడం లేదు ...



రూ.రెండు లక్షల లోపు రుణాలున్న రైతులందరికీ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాకు రుణ మాఫీ చేయలేదు. రూ.1.50లక్షల రుణాన్ని వికారాబాద్ కెనరా బ్యాంక్‌లో తీసుకున్నాను. ప్రతి సంవత్సరం రెన్యూవల్ కూడా చేశాను. రెండో విడతలో రుణ మాఫీ కాలేదు. మూడవ విడతలో అవుతుందని ఎదురు చూశాను. ఇప్పటికీ రుణం మాఫీ కాకపోవడంతో ఏమైందని బ్యాంక్, వ్యవసాయాధికారులను అడుగగా వస్తాయి అంటూ చెబుతున్నారే తప్ప రావడం లేదు. కొర్రీలు లేకుండా రైతు రుణ మాఫీ చేస్తే బాగుంటుంది. – రాజు, మదన్‌పల్లి, వికారాబాద్

## శ్రీవారి ఆలయంలో శంకర సేవ సమితి ప్రత్యేక పూజలు..



కొడంగల్, ఆగస్టు 20: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి శిష్య బృందం శంకర సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాయల ప్రాంగణంలోని శ్రీ వరహాస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచి పీఠాధిపతి సరస్వతీ స్వాములు 1983లో ఏయే ప్రాంతాల్లో పర్యటించారో ఆ ప్రాంతాల్లో గురువందనం, గురు పాదుక పూజా కార్యక్రమాలతో పాటు రుద్రాభిషేకం, చతుర్వేద పారాయణ హోమం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 1983లో చంద్రశేఖర సరస్వతి స్వామి ఆలయానికి వచ్చి 14 రోజుల పాటు బస చేసినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా సరస్వతీ స్వాముల శిష్యులు పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

## పంచాయతీ కార్యదర్శుల నిరసన



మర్పల్లి, ఆగస్టు 20 : పదవీ విరమణ పొందిన తహసీల్దార్ ఆంజనేయులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులను కించపరిచే విధంగా మాట్లాడారని మంగళవారం పంచాయతీ కార్యదర్శులు భోజన విరామ సమయంలో ఎంపీడీవో కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన రెవెన్యూ సమావేశంలో అంజనేయులు పంచాయతీ కార్యదర్శులు పంపు మెకానిక్‌లు, ట్రాక్టర్ డ్రైవర్లని కించపరిచే విదంగా మాట్లాడారని మండి పడ్డారు.. తాము గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. అంజనేయులు పంచాయతీ కార్యదర్శులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిశెట్టి, పంచాయతీ కార్యదర్శులు రాంచందర్, లక్ష్మికాంత్, చంద్రయ్య, కిరణ్‌కుమార్, మహేశ్‌గౌడ్, మాధవరెడ్డి, జోతిర్లింగం, ఆనందం పాల్గొన్నారు.

### మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు



మర్పల్లి, అగస్టు 20 : మర్పల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా శ్రీకాంత్ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.. ఇక్కడ పనిచేస్తున్న ఏవో వసంత రాజేంద్రనగర్ భూసార పరీక్ష కేంద్రానికి బదిలీపై వెళ్లారు.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రైతు శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ మర్పల్లికి బదిలీపై వచ్చారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటల వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు..

### నక్ష ప్రకారం దారితీస్తే గ్రామస్తులందరికీ మేలు..

బంట్వారం, ఆగస్టు 20 : నక్ష ప్రకారం దారి తీస్తే గ్రామస్తులందరికీ మేలు జరుగుతుందని రైతు పుష్పలతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బస్వపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 178లో గ్రామస్తులు శాఖం నర్సింహులు, ప్రభు, పూలపల్లి అనంత య్యాలు వారి స్వంత లాభం కొరకు నక్షబాటను కబ్జాచేశారన్నారు. ఈ విషయం పై కోర్టులో కేసు ఉందని, వీరి దౌర్జన్యం నుంచి కాపాడాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

### బాధితులను పరామర్శించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

పూడూరు, ఆగస్టు 20: ఈ నెల 16న తెల్లవారు జామున బీజేపీ మండల అధ్యక్షుడు రాఘ వేందర్‌పై జరిగిన దాడి ఘటన పై చేవేళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి రాఘ వేందర్‌ను, అదే ఘటనపై రాఘవేం దర్ బావమరిది అయిన పూడూర్ గ్రామా నికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్య క్షుడు రామచంద్రయ్యను మాజీ ఎమ్మెల్యే కె. మహేశ్‌రెడ్డిలు వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం ఎంపీ వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ని కలిసి ఆనందంపై, ఇందుకు కారకులైన పోలీసులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ఇచ్చారు. వీరితో పాటు బీజేపీ జిల్లా అధ్య క్షుడు మాధవరెడ్డి, సదానందరెడ్డి, మల్లేశం, పూడూరు మండల మాజీ ఎం పీపీ మల్లేశం, హరీశ్వర్‌రెడ్డి, రవి, శేఖర్ శ్రీను తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### మంబాపూర్‌ను సందర్శించిన అధికారుల బృందం



ఖానాపూర్‌లో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న మండల ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్ సింగ్

పెద్దేముల్, ఆగస్టు 20 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మండల ఎంపీడీవో జర్నప్ప సూచించారు.మంగళవారం మండల పరిధిలోని మంబాపూర్, ఖానాపూర్, బండపల్లి గ్రామాలను సందర్శించి తాగునీటి సరఫరా, బోర్‌మోటార్‌ల పనితీరు, రిపేర్, గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు,అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. మంబాపూర్ గ్రామంలోని 10వ వార్డు ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడడంతో కాలనీ వాసులు సోమవారం తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో ఆందోళన చేశారు.

దీంతో మంగళవారం ఎంపీడీవో, ఎంపీవో, మిషన్ భగీరథ గ్రిడ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి బోర్ మోటార్‌లను, ఖానాపూర్‌లో అంగన్ వాడీ, గ్రామ పంచాయతీలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా బోర్ మోటార్లు రన్నింగ్ కండిషన్‌లో ఉండి ప్రజలకు గ్రామాల్లో నీటి కొరత లేకుండా చూడా లని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.కార్యక్రమంలో ఎంపీవో రతన్ సింగ్,మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ ప్రతిభ, సూర్యనారాయణ, మంబాపూర్ మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్,రుస్తుం,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిక్కిరిసిన కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్..



కొడంగల్, ఆగస్టు 20 : కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం మంగళవారం ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు గ్రామాలకు చేరుకొన్నారు. సోమవారం రాఖీ వేడుకను జరుపుకొని మంగళవారం స్వస్థలాకు చేరుకునే తరుణంలో రద్దీకి తగినట్లుగా ఆర్టీసబస్సులు నడపలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గుర్చైయ్యారు.

## ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

కాచిగూడ, ఆగస్టు 20: నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి తెలంగాణ వ్యాప్తంగా యువతీ యువకులకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కోర్సుల్లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సులు, పీజీ డిప్లామా ఇన్ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మాస్టర్ ప్రోగ్రాం డేటాసైన్స్, పీజీ డిప్లామా కంప్యూటర్ అప్లికేషన్ కోర్సుల్లో 3 నుంచి 6 నెలల వరకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్నా, పూర్తి చేసిన యువకులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 95058 00047, www.nationalcomputingcouncil.comలో సంప్రదించాలని సూచించారు.

### 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలలో అంతరిక్ష పరిశోధన అంశాలపై 22, 23న విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను హైదరాబాద్ జిల్లా విద్యాధికారి రోహిణి సూచించారు. చంద్రయాన్ –3 విజయంపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత్ ఆన్ ది మూన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అంతరిక్ష సాంకేతికత, ఇస్రో విజయాలు.. తదితర అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు.

## జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

### ముగ్గురి అరెస్టు .. సెల్‌ఫోన్లు స్వాధీనం

మారేడ్‌పల్లి, ఆగస్టు 20: మొబైల్ ఫోన్లను దొంగిలిస్తున్న ఇద్దరు పాత నేరస్తులను, వాటిని కొనుగోలు చేస్తున్న రిసీవర్‌ను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రాణిగంజ్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ మస్తాన్ (22), సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ యాకూబ్ (23)కూలీలు. వీరిద్దరూ గోపాలపురం పరిధిలోని పలు టెంట్‌హౌజ్‌ల్లో కూలీలుగా పనిచేస్తూ సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడున్నారు. ఇందులో మహ్మద్ యాకూబ్‌పై హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసులు ఉన్నాయి. మహమ్మద్ మాస్తాన్ గంజాయి వ్యాపారం చేస్తూ గతంలో పోలీసులకు పట్టుబడ్డారు. వీరిద్దరిపై నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయి. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో సెల్‌ఫోన్లను దొంగిలిస్తూ, వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు రావడంతో పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. నిందితులు మహమ్మద్ మస్తాన్, మహ్మద్ యాకుబ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నారు. చోరీ చేసిన సెల్‌ఫోన్లను ముషీరాబాద్ నివాసి సయ్యద్ మస్తాన్ (23)కు విక్రయించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### కారు ఢీకొని విద్యార్థి మృతి

చిక్కడపల్లి, ఆగస్టు 20: వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సీతయ్య కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన నిఖిల్ కుమార్ (22) రాంనగర్‌లోని పయనీర్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రాంనగర్ చౌరస్తా నుంచి వీఎస్‌టీ రోడ్డులో అతడు తన పల్సర్ వాహనంపై వెళ్తున్నాడు. అదే క్రమంలో ఎదురుగా వేగంగా వచ్చిన ఓ కారు ఢీ కొట్టడంతో నిఖిల్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అబిడ్స్, ఆగస్టు 20: వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై దవాఖానలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాజ్‌మహల్ హోటల్ వద్ద జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. తాజ్‌మహల్ హోటల్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై నివాసముండే ఎండీ గౌస్‌ను ఈ నెల 17న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి రెండు కాళ్లకు బలంగా దెబ్బలు తగిలాయి. పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానలో చేర్పించారు. ఆ సమయంలో తన పేరు ఎండీ గౌస్‌గా బాధితుడు చెప్పాడు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు.



వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు వరద నీటితో ఉధృతంగా పారుతున్నాయి. అనంతగిరిహిల్స్ జలకళ సంతరించుకున్నది. ఆ అందాలను తిలకించేందుకు యువతీయువకులు ఉత్సాహపడుతున్నారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మ హత్య

బంట్వారం, ఆగస్టు 20: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన కడిచర్ల రాజారావు(36) సోమవారం మధ్యాహ్నం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ, మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అయితే మృతుడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె అక్క రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

### యువకుడు అదృశ్యం...మిస్సింగ్ కేసు నమోదు

పెద్దేముల్, ఆగస్టు 20 : మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్‌ఐ కె.గిరి తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన నత్తి సమ్మప్ప పెద్ద కుమారుడు మాలే శ్రీనివాస్ (30) పది సంవత్సరాల నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలోనే తిరుగుతుండేవాడు. ఇంటికి కూడా తరుచూ వస్తూ పోతూ ఉండేవాడు. కానీ పది రోజుల నుంచి ఇంటికి శ్రీనివాస్ వెళ్లకపోవడంతో సమ్మప్ప చుట్టు ప్రక్కల గల గ్రామాల్లో, బంధువుల వద్ద అతని ఆచూకీ కోసం వెతికాడు. ఫలితం లేకపోవడంతో మంగళవారం పెద్దేముల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కులకచర్ల, ఆగస్టు 20 : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన కులకచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామం లో జరిగింది. కులకచర్ల ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం రాములు(42) సోమవారం మధ్యాహ్నం పొలం దగ్గరకు బోరు పెట్టడానికి వెళ్లాడు. బోరుకు విద్యుత్ షాక్ రావడంతో పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి రాములు అక్కడికక్కే మృతి చెందాడు. భార్య తన కూతురుతో కొం దుర్గు మండలంలోని సోషల్ వెల్ఫేర్‌లో 10వ తరగతి చదువుతున్న కుమారునికి దగ్గరకు రాఖీ కట్టడానికి వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న ఎర్రం రాములు పొలం దగ్గరకు వెళ్లినట్లు ఫోన్‌లో ముందుగానే మా ట్లాడాడని, తిరిగి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయ క పోవడంతో ఇంటికి వచ్చిన భార్య పొలం దగ్గరకు వెళ్లి చూడగా బోరు దగ్గర విద్యుత్ షాక్‌తో మృతి చెందడాన్ని గమనించినట్లు తెలిపారు. భార్య ఎర్రం లక్ష్మి ఫిర్యాదు మేర కు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142. NT- 326218

FARM PLOTS SALE

★యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ఫ్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో & బాలానగర్ జడ్చర్ల బెంగుళూరు హైవేకి గజం: 3,999/– శ్రీగంధం చెట్లతో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి।। 7780483434. NT-332574

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-325792-All

★Computer Billing, Nurses and Pharmacy Boys Wanted in Hyderabad. 7207056504. NT-1395

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అనుమతులు లేని విల్లాల కూల్చివేత

మణికొండ, ఆగస్టు 20: చిత్రపురికాలనీలో అనుమతులకు మించి నిర్మిస్తున్న ఏడు విల్లాలను మణికొండ మున్సిపాలిటీ అధికారులు మంగళవారం కూల్చివేసేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో గత కొన్ని రోజులుగా చిత్రపురికాలనీలో చోటు చేసుకుంటున్న అంతర్గత విభేధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గుట్టు చప్పుడు కాకుండా నిర్మిస్తున్న అక్రమ విల్లాలపై స్థానికులు కొంత మంది టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన మున్సిపాలిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా విల్లాలను నిర్మిస్తున్నట్లు గుర్తించారు. చిత్రపురికాలనీలో 220 విల్లాల నిర్మాణం కోసం అనుమతులు పొందిన ఆ సొసైటీ సభ్యులు.. అందుకు భిన్నంగా ఏడు విల్లాలను అక్రమంగా నిర్మిస్తున్నారు. ఇవన్నీ మాస్టర్‌ప్లాన్ రోడ్డులోనే నిర్మించినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలను అతిక్రమించడంతో పాటు రోడ్డులో విల్లాలను నిర్మించడం సరికాదని, టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినా సదరు నిర్మాణదారులు స్పందించకపోవడంతో మంగళవారం టీపీవో సంతోష్‌సింగ్ నేతృత్వంలో కూల్చివేతలను చేపట్టారు. మొదటిరోజు రెండు విల్లాలను కూల్చివేశామన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన ఎవరైనా సరే చర్యలు తప్పవని టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోశ్ సింగ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు..

కులకచర్ల, ఆగస్టు 20 : రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన కులకచర్ల మండల పరిధిలోని చౌడా పూర్ గ్రామ సమీపంలో జరిగింది. కులకచర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన కాట్రావత్ రాగ్య పెద్దకుమారుడు యోగేశ్, తన అల్లుడు బైక్‌పైన గ్రామానికి చెందిన మంగేశ్‌తో కలిసి మైసమ్మ బోనాలకు సామగ్రిని తీసుకురావడానికి చౌడాపూర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి సామను తీసుకొని మక్తవెంకటాపూర్ గ్రామానికి వస్తుండగా మరికల్ నుంచి వస్తున్న ఓమిని కారు అతివేగంగా బైక్‌ను ఢీకొనడంతో యోగేశ్ తలకు, గదవకు తీవ్ర గాయాలయ్యాయి. మంగేశ్‌కు కుడి కాలుకు గాయాల య్యాయని, అతివేగంతో వచ్చి తన కుమా రున్ని ఢీకొట్టిన ఓమిని కారు డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రాగ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962